క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పర్యవేక్షిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఊర్వశి థియేటర్ ఎదుట నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్ కుమార్‌తో కలిసి నగర మేయర్ బంగి అనిల్ కుమార్ పరిశీలించారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, గుండ రమేశ్, ముత్యాల శ్రీనివాస్, నరేంద్ల రవి పాల్గొన్నారు.

ఆదాయం సర్టిఫికెట్ లేకున్నా దరఖాస్తు చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: గృహలక్ష్మి పథకానికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేకున్నా మిగతా ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు తెలిపారు. సుల్తానాబాద్ మండల పరిషత్‌లోని ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దరఖాస్తు చేసుకోవాడానికి సమయం లేకపోవడంతో కులం, ఆదాయం సర్టిఫికెట్స్ కోసం ఎదురు చూడకుండా సంబంధింత సర్టిఫికెట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు సర్టిఫికెట్స్ అందించాలని సూచించారు.

34వ రోజుకు చేరిన సమ్మె

ఎలిగేడు: మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుల చేస్తున్న సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరింది. కార్మికులు పాల్గొన్నారు.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు.

ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ లత

రామగుండం: రామగుండం బైపాస్ రోడ్డు సమీపంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా స్థానిక కార్పొరేటర్ కౌశిక లత స్పందించి మంగళవారం ప్రమాద సూచిక సైన్ బోర్డులను ఏర్పాటు చేయించారు. రామగుండం ఏఎస్సై పులి సుదర్శన్, బీజేపీ నాయకులు గంగాప్రసాద్, బోనగిరి కుమార్, జర్పుల శ్రీనివాస్, సందీప్, సంపత్ యున్నారు.

ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలి

సుల్తానాబాద్: ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో పండ్లు, కూరగాయల మొక్కలు నాటాలని కౌన్సిలర్ మమత కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాయకులు సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్ ఉన్నారు.

సివిల్ ఎస్సైగా ఎంపికైన రవళి



గోదావరిఖని: స్థానిక సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన ఏలూరి రవళి సివిల్ ఎస్సైగా ఎంపికైంది. నిరుపేద కుటుంబానికి చెందిన రవళి కాళేశ్వరం జోన్‌లో సివిల్ ఎస్సైగా ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎస్సైగా ఎంపిక కావడంలో తన భర్త శ్రీధర్‌రెడ్డి కృషి ఎంతగానో ఉందని పేర్కొంది.

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యల సాధనకు యూఎస్ పీసీ దశలవారీ పోరాటం సాగిస్తుందని స్టీరింగ్ కమిటీ నాయకులు గద్దె శ్రీనివాస్ అన్నారు. 12న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన ర్యాలీ, ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు లక్ష్మణ్, రామ్‌కిషన్ రావు, సంతోష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పోచయ్య, రాజనర్సు, కుమారస్వామి, కుమార్, కనకయ్య, ప్రవీణ్, నరేశ్ ఉన్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జూలపల్లి: కురుమ సామాజిక వర్గం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ యువ సేన జిల్లా అధ్యక్షుడు గుంటి శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుమ యువత ఉన్నత విద్యకు సబ్సిడీతో కూడిన రుణాలను ఇవ్వాలని, గొర్రెల కాపరులకు వందశాతం సబ్సిడీతో గొర్రెలను ఇవ్వాలని కోరారు. యువసేన మండల మాజీ అధ్యక్షుడు బండారి శంకర్, ఎల్కపెల్లి ఐలయ్య ఉన్నారు.

పార్కులపై నిర్లక్ష్యమేల!

- నిరుపయోగంగా ఆట వస్తువులు
- పట్టణవాసులకు అందని ఆహ్లాదం
- కొత్త పార్కుల ఏర్పాటుకు స్థలం కొరత
- అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల విజ్ఞప్తి



పార్కులో నిరుపయోగంగా ఉన్న ఆట పరికరాలు

పెద్దపల్లిరూరల్: పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది. మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన పెద్దపల్లి పట్టణంలో పార్కులు ఏర్పాటు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సెలవుదినాల్లో పిల్లలతో కలిసి సంతోషంగా గడిపేందుకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిచడంపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదంటున్నారు.

నిరుపయోగంగా ఆట వస్తువులు..

మున్సిపల్ తొలి పాలకమండలి టీచర్స్‌కాలనీ ప్రాంతంలోని వాటర్ ట్యాంకు వద్ద మినీ పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు చేపట్టింది. ఆ సమయంలో అక్కడ దాదాపు రూ.5లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత అటువైపు ఎవరూ చూడకపోవడం ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. అందులో ఏర్పాటు చేసిన పరికరాలన్నీ తుప్పుపడుతున్నాయి.

కొత్త పార్కుల ఏర్పాటుకు స్థలం కొరత..

పెద్దపల్లి ప్రాంతంలో ప్రభుత్వ, దేవాదాయ శాఖ స్థలాలను అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజోపయోగ పనులకు మాత్రం స్థలం లేదంటుండడం పై ప్రజలు మండిపడుతున్నారు. స్థలం లేదన్న సాకుతో బస్సు డిపో రాకుండా పోయిందని గుర్తు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం పార్కుల ఏర్పాటు కు అనువైన స్థలం చూపాలంటూ కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులందరికీ మున్సిపల్ పాలకమండలి లిఖిత పూర్వకంగా కోరిందని పేర్కొంటున్నారు.

అధికారులు చొరవ చూపాలి



జిల్లా కేంద్రం హోదాకు తగ్గట్టుగా పెద్దపల్లిలో పార్కులు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ చొరవ చూపాలి. ఏడేళ్ల కాలం కింద మొదలైన మినీ ట్యాంక్ బండు పనులకు మున్సిపల్ నుంచి కూడా నిధులు ఖర్చుచేస్తున్నప్పటికీ అధికారులు పనులు ఇంకా పూర్తి చేయకపోవడం విచారకరం. వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– సయ్యద్ ఫయాజ్, పెద్దపల్లి

కలెక్టర్‌కు విన్నవించాం



పట్టణాన్ని సుందర పెద్దపల్లిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అందుబాటులో ఉన్న ప్రధాన కూడళ్లను ఆధునీకరించే పనులు చేపడతాం. మినీట్యాంకు బండు కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి రానుంది. కొత్తగా పార్కులు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో కలెక్టర్, అధికారులను కలిసి విన్నవించాం. అనువైన స్థలం లభ్యమైతే పార్కులను అందుబాటులోకి తెస్తాం.

– మమతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

తొలిమెట్టు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల విద్యాధికారి

ధర్మారం: విద్యార్థులు సామర్థ్యాలను సాధించేలా తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి ఛాయాదేవి కోరారు. ధర్మారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి ఉపాధ్యాయుల తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. తొలిమెట్టు మండల నోడల్ అధికారి దామోదర్, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విట్టల్, రిసోర్సు పర్సన్‌లు వెంకటరమణారెడ్డి, నూతి మల్లయ్య, రాజేశం, జాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

రామగుండం: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించడమే తొలిమెట్టు ముఖ్య ఉద్దేశమని మండల నోడల్ అధికారి భవాని అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇజ్రాయిల్, తానం స్వర్ణ, శ్రీధర్, రాజేశ్వర్ దయాల్, రిసోర్స్ పర్సన్లు బయ్యపు సుదర్శన్‌రెడ్డి, దేవిక, రమేశ్, సత్యనారాయణ, నారాయణమ్మ, మల్లేశ్వరి హాజరయ్యారు.

డిమాండ్ల సాధనకు జీపీ కార్మికుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

కాల్వశ్రీరాంపూర్: డిమాండ్ల సాధన కోసం జీపీ కార్మికులు కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. తమ పోస్టులు రెగ్యులర్ చేయాలని, కనీస వేతనచట్టం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సుమారు రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. ఏఎస్సై నీలిమ కార్మికులను శాంతింపజేసి రాకపోకలు కొనసాగేలా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు రాగమల్ల సురేశ్, కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, నాయకులు రాజబాబు, సంపత్, లక్ష్మణ్, రామస్వామి, కుమార్, ఓదెమ్మ, లక్ష్మి, అనసూర్య పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం రామాచారి డిమాండ్ చేశారు. మంగళవారం గుడిసెవాసుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5నెలల నుంచి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పేద ప్రజలు పోరాటం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంటి స్థలం ఉన్న వారు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని, ప్రభుత్వం ప్రకటించిన రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని, అలాగే దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపేందర్, రమణ, సాయిమాధవి, భాగ్య, ,మహాలక్ష్మి, గీతాంజలి, పుష్ప, నిర్మల, సరిత, లావణ్య పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించడానికి మున్సిపల్ కమిషనర్ సుచరణ్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం కౌంటర్లు దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. స్వీకరించిన దరఖాస్తు పత్రాలను డివిజన్ల వారీగా అధికారులు విభజిస్తున్నారు. 10వ తేదీ వరకు గడువు ఉండడంతో దరఖాస్తు చేసుకోవడానికి జనాలు భారీగా తరలివస్తున్నారు.

దరఖాస్తులో వెసులుబాటు

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తుకు పత్రాలు జతచేయడానికి సమయం లేకపోవడంతో వెసులుబాటు కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.సుచరణ్ మంగళవారం తెలిపారు. రామగుండం మండల తహసీల్దార్ సూచనల ప్రకారం కులం, నివాసం ధ్రువీకరణ పత్రాలు ప్రస్తుతం లేకున్నాఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు జతపరిచి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విచారణ సమయంలో కులం, నివాసం ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా అందజేయాలన్నారు.



కోల్‌సిటీ: బల్దియాలో ప్రత్యేక కౌంటర్

జూలపల్లిలో 97 దరఖాస్తులు

జూలపల్లి: గృహలక్ష్మి పథకానికి మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి 97 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా దరఖాస్తులు స్వీకరిచంఆరు.

దరఖాస్తుల వెల్లువ

సుల్తానాబాద్: గృహలక్ష్మి పథకానికి మంగళవారం పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. మీసేవా కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి.



సుల్తానాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని మీసేవ, జిరాక్స్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం మంగళవారం జనాలతో నిండిపోయాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి దరఖాస్తుదారులు మండల కేంద్రానికి వచ్చారు. మీ సేవ కేంద్రాలు దరఖాస్తుదారులతో నిండిపోయాయి.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: రవాణా రంగంలో కార్మికులుగా పనిచేస్తున్న వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర నాయకుడు వేల్పుల కుమారస్వామి కోరారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులంతా ఆర్థికంగా చితికి అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదబీమాను రూ.10లక్షలకు పెంచాలన్నారు. నూతన మోటారు వాహనచట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు మల్లేశ్, భాస్కర్, నరేందర్, శ్యాం, మధు, పరశురాం, దిలీప్, అంజి, రాములు, సారయ్య ఉన్నారు.

ర్యాలీ నిర్వహణ

జ్యోతినగర్: రాష్ట్రంలోని రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పబ్లిక్ – ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి టీటీఎస్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించి ఎంవీఐ భీం సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మోటారు వాహన చట్టం–2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బేతి రవి, కోశాధికారి పంజాల శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పుచ్చకాల మునీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ మాట్లాడుతూ తల్లులు చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు, పాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం కోసం పలకలు, అన్నప్రాసన్న గిన్నెలు అందించారు. సర్పంచ్ గాగిరెడ్డి ప్రేమలత, ఎంపీటీసీ గాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, క్లబ్ సభ్యులు నాడెం శ్రీనివాస్, ఉప్పులంచ దయానంద్, అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ బ్రాండీనా, టీచర్ బుచ్చమ్మ, బొల్లి కవిత పాల్గొన్నారు.



పలకలు అందిస్తున్న క్లబ్ అధ్యక్షుడు

యాదవులకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: జనాభా ప్రాతిపదికన యాదవులకు అన్నిరంగాల్లో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని యాదవ హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు పెగడ రమేశ్ యాదవ్ కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన యాదవగర్జన సభకు జిల్లాకేంద్రం నుంచి తరలివెళ్లారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ సెంటర్ ప్రారంభం

గోదావరిఖనిటౌన్: విజయమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని రామగుండం కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు తస్లీమా భాను తెలిపారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ముస్లిం మహిళల కోసం విజయమ్మ ఫౌండేషన్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, సెక్రటరీ సిద్దార్థ పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఓదెల: ఓదెలలో తన సొంత భూమిలో పెంచుకున్న టేకుచెట్లను నరికిన అదే గ్రామానికి చెందిన లింగయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని పెంట అయిలయ్య అనే రైతు డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు గుంటల స్థలంలో పెంచిన టేకుచెట్లను ఎలాంటి అనుమతి లేకుండా కొట్టివేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గోదావరిఖని: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గోదావరిఖని టూటౌన్ పోలీసులు గుర్తించి మంగళవారం బాధితుడికి అప్పగించారు. యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఎల్.ప్రకాష్ స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం సమీపంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి టూటౌన్ సీఐ వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు.

ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

జ్యోతినగర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ బాధితురాలికి అందించారు. వివరాలు ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాజిపల్లెకు చెందిన నవలత జూలైలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ విధానం ద్వారా సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు. కాగా మంగళవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఫోన్ అందించారు.

గవర్నర్‌కు పోస్టుకార్డులు



పోస్టుకార్డులు వేస్తున్న నాయకులు, కార్మికులు

రామగుండం: పంచాయతీ కార్మికుల సమస్యలతోపాటు 34 రోజులుగా చేస్తున్న రిలే దీక్షల వివరాలను రాష్ట్ర గవర్నర్ తమిళిసై దృష్టికి తీసుకెళ్లేదుకు బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. వివరాలన్నీ పోస్టు కార్డుపై రాసి రాష్ట్ర గవర్నర్‌కు పోస్టు చేసినట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. బీఎస్పీ అంతర్గాం మండల అధ్యక్షుడు చిలుక రామ్మూర్తి, సీపీఎం నాయకులు అడారి నర్సింగరావు, పంచాయతీ కార్మికులు తూడూరి శ్రీనివాస్, రాపోలు విద్యాకర్‌రావు, కొండపాక కరుణాకర్, ఉప్పులేటి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్రగాయాలు

గోదావరిఖని: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో మంగళవారం ఆటో ఢీకొట్టిన సంఘటనలో బైక్‌పై వెళ్తున్న సింగరేణి కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ముందు వెళ్తున్న బైక్‌ను ఆటో ఢీకొనడంతో జీడీకే–1 గనిలో బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న కె.అంజయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మహాలక్ష్మి అమ్మవారి ఆదాయం రూ.58,370

మంథని: మంథని మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేయడం ద్వారా ఆలయానికి రూ.58,370 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారుపాక చంద్రకళ తెలిపారు. ఆలయలో మంగళవారం నిర్వహించిన వేలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారి చీరలు కొనుగోలు చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, మేనేజర్ రాజ్‌కుమార్, ఆలయ కమిటీ డైరెక్టర్లు పోతరాజు వెంకటలక్ష్మి, బత్తుల విజయలక్ష్మి, కాయితోజు సమ్మయ్య, బడికల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రవి కిరణ్ ఉన్నారు.



చీరలు కొనుగోలు చేస్తున్న చైర్‌పర్సన్ శైలజ

సంక్షిప్త వార్తలు

✦ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బూడిత అణమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.19,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, నాయకులు బాద్రపు శంకర్, సాగి శ్రీధర్‌రావు, యాదగిరి రాజయ్య, చిందం సతీశ్, మల్లయ్య పాల్గొన్నారు.

✦ ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధిలోని ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. రూ.3లక్షల వ్యయంతో ప్లాంట్ ప్రారంభించారు. సేఫ్టీ జీఎం గురువయ్య, సాంబయ్య, ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, సివిల్ డీజీఎం నవీన్, పర్సనల్ డీజీఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

✦ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో కలీమొద్దీన్ సూచించారు. స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామాల్లోని వీవో సంఘాల అధ్యక్షులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఏపీఎం సుధాకర్, సీసీలు శ్రీధర్, మల్లేశం, జ్యోతి పాల్గొన్నారు.

✦ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీని కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి మంగళశారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

✦ క్లిమ్స్ ఉత్తర్వులు రద్దు చేయాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల కాంట్రాక్టు లేబర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (క్లిమ్స్) పేరుతో విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

✦ గద్దర్‌కు నివాళి

పెద్దపల్లిరూరల్: ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి మంగళవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద పంచాయతీ కార్మికులు నివాళి అర్పించారు.

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి అర్పించారు.

✦ 'గృహలక్ష్మి' గడువు పొడిగించాలి

కమాన్‌పూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించాలని బీఎస్పీ నాయకులు మంగళవారం రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్, రేణికుంట్ల మల్లేశ్, బొంకూరి అజయ్, నర్సయ్య, ఆదినారాయణ, రాజేశం, రమేశ్ ఉన్నారు.

✦ దరఖాస్తులో మార్పులు చేయాలి

జూలపల్లి: ఇల్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేసి రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దరఖాస్తులో నిబంధనలు కఠినంగా ఉన్నాయని వార్డు మెంబర్ల ఫోరం మండల అధ్యక్షుడు తీగెల అశోక్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకం దరఖాస్తులో నిబంధనలు మార్చాలని కోరుతూ దరఖాస్తుదారులతో మంగళవారం డిప్యూటీ తహసీల్దారు అబూబాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సురేశ్, ఇమామ్, శ్రావణ్, సంపత్, అంజయ్య ఉన్నారు.

షీటీంకు సమాచారం అందించాలి



మాట్లాడుతున్న షీటీం సభ్యులు

ఓదెల: విద్యార్థులను ఎవరైనా వేధిస్తే షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని షీటీంకు అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.మల్లారెడ్డి, కానిస్టేబుల్ స్నేహలత తెలిపారు. ఓదెలలోని కస్తూర్బా బాలికల పాఠశాల, పొత్కపల్లి హైస్కూలులో మంగళవారం 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మహిళల భద్రత గురించి వివరించారు. విద్యార్థులు కాలేజీకి వచ్చే వెళ్లే సమయంలో ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా మాట్లాడినా వెంటనే సెల్ నంబర్ 6303923700కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సమ్మన్న, శ్రీనివాస్, ఎస్‌ఓ జ్యోతి పాల్గొన్నారు.